సాక్షి నల్లగొండ

శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



దసరాకు ప్రత్యేక బస్సులు
దసరా పండుగకు ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపేందుకు సిద్ధమైంది. - 8లో



సాగర్ డ్యాంపై 'స్వచ్ఛతా హీ సేవ'
సాగర్ డ్యాంపై కేఆర్ఎంబీ చైర్మన్ బీపీ.పాండే ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతా హీ సేవ నిర్వహించారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	587.90 అడుగులు
ఇన్‌ఫ్లో	:	2,05,796 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	2,11,315 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	32,886 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	9,500 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	8,629 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	2,400 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	300 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

20న నల్లగొండలో జాబ్‌మేళా

నల్లగొండ: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 20న ఉదయం 10.30 గంటలకు నల్లగొండలోని ఐటీఐ కళాశాల క్యాంపస్‌లో జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్.పద్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ నుంచి డిగ్రీ, ఐటీఐ అర్హత కలిగి 18 నుంచి 35 సంవత్సరాల వయసుగల వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు వారి బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా 20వ తేదీన జిల్లా ఉపాధి కల్పన కార్యాలయానికి హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు సెల్ :78934 20435 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

నాణ్యమైన పత్తికే మద్దతు ధర



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: రైతులు అన్ని ప్రమాణాలు పాటించి మార్కెట్‌కు తీసుకొచ్చే నాణ్యమైన పత్తికి మద్దతు ధర చెల్లించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ కోరారు. గురువారం నల్లగొండ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పత్తి కొనుగోళ్లపై ఆయా శాఖల అధికారులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో 5,67,613 ఎకరాల్లో పత్తి పంట సాగైందని, 4.54లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సంవత్సరం కేంద్ర ప్రభుత్వం రూ.8,110 మద్దతు ధర కల్పించిందన్నారు. గతంలో కంటే రూ.589 పెంచిందన్నారు. రైతులు మద్దతు పొందేందుకు 8 నుంచి 12 శాతం తేమ మించకుండా పత్తిని మార్కెట్‌కు తెచ్చేందుకు అధికారులు ముందస్తుగా అవగాహన కల్పించాలన్నారు. నాణ్యతలేని పత్తిని సీసీఐ కొనుగోలు చేయదన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, మిల్లుల యజమానులు పాల్గొన్నారు.

20న ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

నల్లగొండ టూటౌన్: ఈనెల 20న నల్లగొండలోని విపస్యా స్కూల్‌లో ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఈ నెల 25నుంచి 28 వరకు మహబూబ్‌నగర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు పంపుతామని పేర్కొన్నారు. క్రీడాకారులు ఉదయం 9 గంటలకు ఆధార్, పాస్ ఫొటోలతో రావాలని కోరారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



హాలియా : మాట్లాడుతున్న కృష్ణవేణి

హాలియా, నిడమనూరు : పోషకాహారం తీసుకోవడం ద్వారానే కిశోరబాలికలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు అధికారిని ఉదయశ్రీ అన్నారు. అనుముల ప్రాజెక్టు హాలియా సెక్టార్ పరిధిలోని హాలియా-2, నిడమనూరు మండలం ముప్పారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవంలో భాగంగా నిర్వహించిన అవగాహన సదస్సుల్లో వారు మాట్లాడారు. చిన్నారులకు చదువుతో పాటు పోషకాహారం కీలకమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సదస్సుల్లో హాలియాలో సూపర్‌వైజర్ రమాదేవి, భవిత స్కూల్ టీచర్ వాణి అంగన్‌వాడీ టీచర్లు వజ్రమ్మ, విజయ, నర్మద, మంగమ్మ, శంకరమ్మ, నిడమనూరు మండలం ముప్పారంలో సూపర్‌వైజర్ సైదాబేగం, అంగన్‌వాడీ టీచర్ నాగమణి, హెల్పర్ లింగమ్మ, పంచాయతీ కార్యదర్శి బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో గురువారం సాయంత్రం వెండిజోడు సేవలను అర్చకులు సంప్రదాయంగా ఊరేగించారు. వేకువజాము నే ఆలయాన్ని తెరిచిన అర్చకులు శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం జరిపించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠాలంకారమూర్తులకు నిజాభిషేకం నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం వంటి కైంకర్యాలు నిర్వహించారు.

ఏళ్ల సమస్య.. తీరుతున్న వేళ

తిరుమలగిరి సాగర్ మండలంలో భూములపై హక్కులు

- 13 గ్రామాల రైతులకు త్వరలోనే పట్టాల పంపిణీ
- 4,037 ఎకరాలపై 4,219 మందికి కొత్త పాస్‌బుక్కులు
- అత్యధికంగా చింతలపాలెం వాసులకు లబ్ధి
- నిరుపేద రైతుల్లో ఆనందం





ఈయన నేనావత్ శంకర్ నాయక్. ఈయనది తిరుమలగిరి(సాగర్) మండలం నాగార్జునపేట తండా. నాగార్జునసాగర్ ముంపు బాధితుడు కావడంలో 1978లో అప్పటి ప్రభుత్వం ఈయనకు చింతలపాలెం రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 12లో 2.20 ఎకరాల భూమికి డీఫార్మ్ పట్టా ఇచ్చింది. అప్పటి నుంచి 2019 వరకు ప్రభుత్వ పథకాలతోపాటు బ్యాంకులో రుణాలు పొందారు. గత ప్రభుత్వం ధరణిలో ఈ సర్వే నంబర్‌ను వివాదాస్పద భూముల పేరుతో పార్ట్-బీలో చేర్చింది. దీంతో ఆయనకు కొత్త పాస్ పుస్తకం రాలేదు. అప్పటి నుంచి రైతుబంధు, రుణమాఫీ ఆగిపోయింది. ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టిన భూభారతి పైలెట్ సర్వేలో కాస్తు, కబ్జా ఆధారంగా అధికారులు మళ్లీ నమోదు చేశారు. దీంతో ప్రభుత్వాలు అందజేసే సంక్షేమ పథకాలు ఇకనుంచి అందనున్నాయని ఆయన సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. ఈయనొక్కరే కాదు మండలంలో వేల మంది రైతుల సమస్య తీరబోతోంది. వారందరికీ భూభారతిలో ప్రస్తుత ప్రభుత్వం హక్కులను కల్పిస్తూ త్వరలో పట్టాలు ఇవ్వనుండడంతో తిరిగి సంక్షేమ పథకాలను పొందే వీలు ఏర్పడనుంది. దీంతో ఆయా రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: జిల్లాలోని తిరుమలగిరి సాగర్ మండలంలోని 13 గ్రామాలకు చెందిన 4,219 మంది రైతులకు కొత్తగా పాస్‌బుక్కులు అందనున్నాయి. 4,037 ఎకరాలపై ఆయా రైతులకు హక్కులు దక్కబోతున్నాయి. వారందరికీ ప్రభుత్వం త్వరలోనే పట్టాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం భూభారతి అములులోకి తీసుకొచ్చిన తర్వాత జిల్లాలోని తిరుమలగిరి సాగర్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుంది. ఆ మండలంలోని 235 సర్వే నంబర్లను గుర్తించి వాటి పరిధిలోని 23 వేల ఎకరాల్లో సర్వే నిర్వహించి, 12 వేల ఎకరాలు ప్రభుత్వ భూమిగా గుర్తించింది. అందులో 8,037 ఎకరాల భూమి సాగుకు అనుకూలంగా ఉన్నట్లు తేల్చింది. అందులోనూ 4 వేల ఎకరాలకు సంబంధించి రైతులు ఇప్పటికే పాస్‌బుక్కులు కలిగి ఉండి భూమిని సాగు చేసుకుంటున్నట్లు తేల్చింది. మరో 4,037 ఎకరాల పరిధిలో పాస్‌బుక్కులు లేకుండా సాగు చేసుకుంటున్నారని, వారందరికీ హక్కులు కల్పించాలని నిర్ణయించింది. మరోవైపు తల్లిదండ్రులు చనిపోయిన వారికి పౌతి ద్వారా భూభారతిలో హక్కులను కల్పించేలా చర్యలు చేపట్టింది.

బోగస్ పట్టాలు నిజమే.. గతంలోనే చెప్పిన 'సాక్షి'



బోగస్ పట్టాలపై సాక్షి ప్రచురించిన కథనం

మండలంలో చేపట్టిన భూభారతి సర్వేలో బోగస్ పట్టా పాస్‌బుక్కులు కలిగి ఉన్న రైతులు ఉన్నట్లు తేలింది. 2,936 ఎకరాల భూమిపై 3,069 మంది రైతులు బోగస్ పాస్ పుస్తకాలు కలిగి ఉన్నట్లు తేల్చింది. వీటిని ప్రభుత్వం ఇటీవల రద్దు చేసింది. ఈ విషయాన్ని 'సాక్షి' గతంలోనే బోగస్ కృష్ణ'పట్టా' శీర్షికన ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. బోగస్ పట్టాలను సృష్టించి వివిధ పథకాలు పొందుతూ రూ.కోట్లు కొల్లగొట్టినట్లు ఈ కథనంలో పేర్కొంది. భూములు తమ ఆధీనంలోనే ఉన్నా ధరణి కారణంగా హక్కులను కోల్పోయిన వారి పరిస్థితులను కూడా సమగ్రంగా వివరించింది. ఇప్పుడు ప్రభుత్వం ఆ విషయాలన్నీ అధికారికంగా నిర్ధారించింది.

చింతలపాలెంలో ఎక్కువ మందికి లబ్ధి

మండలంలోని చింతలపాలెం గ్రామంలో అధిక విస్తీర్ణంలో అత్యధికంగా 1,288 మంది రైతులకు భూములపై పూర్తిస్థాయి హక్కులను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే ఆయా భూములను సాగు చేసుకుంటున్న రైతులుగా వారి పేర్లను భూభారతిలో నమోదు చేసింది. 519 మంది రైతులకు 591 ఎకరాల భూమిపై హక్కులు కల్పించనుంది. అతి తక్కువగా జమ్మికుంట గ్రామంలో 41 మంది రైతులకు 22 ఎకరాల్లో పట్టాలను అందజేయనుంది.

పాస్‌బుక్కులు అందుకోనున్న రైతులు

గ్రామం	రైతులు	ఎకరాలు
చింతలపాలెం	1,288	1,537
నెల్లికల్	420	364
తునికినూతల	261	344
తిరుమలపాలెం	519	591
ఎల్లాపురం	264	241
రాజవరం	350	179
నేతాపూర్	345	261
కొంపల్లి	180	123
కొన్నేరుపురం	163	92
అల్వాల	204	197
శ్రీరాంపురం	97	45
సిల్గాపురం	87	35
జమ్మికుంట	41	22

ధరణితో రూ.90వేలు నష్టపోయిన



మాకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం తిమ్మయపాలెం శివారులోని సర్వే నంబర్ 60లో 1.05 ఎకరాల లావుణి పట్టాలు పంపిణీ చేసింది. 2017 వరకు అన్ని పథకాలు వర్తించాయి. ధరణిలో మా భూమిని పార్ట్-బీలో పెట్టడంతో ఒక్క రైతుబంధు ద్వారానే ఇప్పటి వరకు రూ.90వేలు కోల్పోయిన. ప్రస్తుత ప్రభుత్వం కాస్తు కాబ్జా ఆధారంగా సర్వే చేసి నా భూమి భూభారతిలో నమోదు చేసింది. 1బీ, పహాణీలు సైతం వస్తున్నాయి. ప్రతి సంక్షేమ పథకానికి అర్హున్ని అవుతాను.

– మేరావత్ మునినాయక్, నాయకునితండా

ధాన్యం అమ్ముకోలేకపోయాను



మా భూములు మొన్నటి వరకు పార్ట్-బీలో ఉండడంతో మాకు పట్టాదార్ పాస్‌పుస్తకాలు రాలేదు. మేము సేద్యం చేస్తూ భూమిపై కబ్జాలో ఉన్నప్పటికీ మాకు ఎలాంటి హక్కులు లేవు. మేము పండించిన పంటను కూడా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోలేకపోయా. దీంతో మేము ఆర్థికంగా చాలా నష్టపోయినాం. నాకు చింతలపాలెం గ్రామ రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 222లో ఉన్న 3 ఎకరాల భూమి భూభారతి పోర్టల్‌లో నమోదై ఉంది.

– సఫావత్ పూలా, సఫావత్‌తండా



ఎస్సీ సంక్షేమ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల యాజమాన్యాలు

మూడేళ్ల నుంచి బిల్లులివ్వరా..

- బెస్ట్ అవైలబుల్ స్కూళ్ల యాజమాన్యాల ఆవేదన
- రూ.6.81 కోట్ల బకాయిలు వెంటనే ఇవ్వాలని డిమాండ్
- కలెక్టరేట్‌లో సంక్షేమ భవన్ వద్ద ఆందోళన
- ఎస్సీ సంక్షేమ కార్యాలయంలో వినతిపత్రం అందజేత

నల్లగొండ: బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ప్రభుత్వం ఎంపిక చేసిన పేద విద్యార్థులకు విద్యనందించే ప్రైవేట్ పాఠశాలలు యాజమాన్యాలకు మూడేళ్లుగా బిల్లులు అందక ఆందోళనకు గురవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ప్రైవేట్ పాఠశాలల్లో 5వ తరగతి నుంచి పదవ తరగతి వకు రెసిడెన్షియల్, డే స్కాలర్ కింద 1వ తరగతి విద్యార్థులకు విద్యాబోధన అందిస్తుంది. అయితే మూడేళ్ల నుంచి నిధులు విడుదల చేయకపోవడంతో ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

12 పాఠశాలల ఎంపిక

జిల్లాలో 12 ప్రైవేట్ పాఠశాలలను బెస్ట్ అవైలబుల్ స్కీం కింద ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో 5 నుంచి 10వ తరగతి వరకు చదివే రెసిడెన్షియల్ విద్యార్థులకు ఒక్కొక్కరికి సంవత్సరానికి రూ.42 వేలు, నాన్ రెసిడెన్షియల్ విద్యార్థికి రూ.28 వేలు చొప్పున ప్రభుత్వం చెల్లిస్తుంది. అయితే ప్రభుత్వం ఇచ్చే ఈ డబ్బులకు ఆ బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద బోధించే పాఠశాలలు ప్రతి విద్యార్థికి ఏటా టెస్ట్ బుక్స్‌తోపాటు నోటుబుక్కులు, రెండు జతల యూనిఫామ్, రెండు జతల షూ ఇవ్వడంతో పాటు వారికి హాస్టల్ వసతి కల్పించి భోజనం అందిస్తున్నాయి. ఆయా పాఠశాలలకు మూడేళ్ల నుంచి ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు చెల్లించకపోవడంతో రూ.6.81 కోట్లకుపైగా పెండింగ్‌లో ఉన్నాయి.

పాఠశాలలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఇలా.. (రూపాయల్లో..)

సంవత్సరం	చెల్లించాల్సిన బిల్లులు
2022-23	70,70,852
2023-24	2,91,67,880
2024-25	3,19,20,000
మొత్తం	6,81,58,732

నిధులు విడుదల చేసి ఆదుకోవాలి

బెస్ట్ అవైలబుల్ స్కీం కింద మూడేళ్ల నుంచి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడాన్ని నిరసిస్తూ జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ కింద బోధన అందిస్తున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు గురువారం నల్లగొండ కలెక్టరేట్ సముదాయంలోని సంక్షేమ భవన్ వద్ద ఆందోళనకు దిగాయి. అనంతరం ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయంలో డీడీ అందుబాటులో లేకపోవడంతో సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశాయి. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల యాజమాన్యాలు మాట్లాడుతూ మూడేళ్ల నుంచి బోధన చేయడం ఒక ఎత్తయితే మా పాఠశాలల్లో బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదివే విద్యార్థులకు తాము డబ్బులు ఖర్చు పెట్టి బుక్స్, యూనిఫామ్‌లు, షూస్ కొని ఇస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక హాస్టల్‌లో ఉండే విద్యార్థులకు వసతితో పాటు భోజన ఖర్చులు కూడా తాము భరిస్తున్నామని పేర్కొన్నాయి. తాము అప్పులు చేసి ఎదురు పెట్టుబడి పెడుతున్నామని, మా ఇబ్బందులు గమనించి వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులు విడుదల చేసి ఆదుకోవాలని వేడుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు.

125 మంది ఉపాధ్యాయుల సర్దుబాటు

- జాబితా విడుదల చేసిన డీఈఓ
- వెంటనే రిలీవ్ చేయాలని ఆదేశం
- నిబంధనలకు విరుద్ధంగా చేశారంటున్న యూటీఎఫ్



నల్లగొండ: జిల్లా విద్యా శాఖలో 125 మంది ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ తదితర ఉపాధ్యాయులను కలెక్టర్ అనుమతితో డీఈఓ భిక్షపతి సర్దుబాటు చేశారు. ఈ జాబితాను గురువారం విడుదల చేశారు. ఇటీవల విద్యా శాఖ కమిషనర్ అవసరం ఉన్నచోట ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు అవకాశం కల్పించారు. దీంతో దానికి అనుగుణంగా జిల్లాలో ఎక్కడైతే విద్యార్థుల కంటే ఎక్కువగా ఉపాధ్యాయులు ఉన్నారో వారిని అవసరమున్న చోటకు సర్దుబాటు చేస్తు డిప్యుటేషన్లు ఇచ్చారు. వారందరినీ సంబంధిత పాఠశాలల్లో వెంటనే విధుల్లో చేరాలని సంబంధిత ప్రధానోపాధ్యాయులు వారిని రిలీవ్ చేసేలా ఎంఈఓలు చర్యలు తీసుకోవాలని డీఈఓ ఆదేశించారు.

నిబంధనలు పాటించలేదు

మండలాల పరిధిలోని ఉపాధ్యాయులను నిబంధనల ప్రకారం సర్దుబాటు చేయాల్సి ఉన్నా ఐదు మండలాల్లోని వారిని ఇతర మండలాలకు సర్దుబాటు చేశారు. సర్దుబాటు చేసే సందర్భంలో జూనియర్లను కాకుండా సీనియర్లను సర్దుబాటు చేయడం నిబంధనలకు విరుద్ధం.

– నర్రా శేఖర్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు

అవసరాన్ని బట్టే సర్దుబాటు

ఉపాధ్యాయుల సర్దుబాటు నిబంధనల మేరకే చేశాం. ఎక్కడైతే అదనంగా ఉపాధ్యాయులు ఉన్నారో అక్కడ నుంచి వారిని అవసరం ఉన్న ప్రాంతాలకు సర్దుబాటు చేశాం. నిబంధనలకు అనుగుణంగా అక్కడ ఉన్న అవసరాన్ని బట్టి అదనపు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశాం.

– భిక్షపతి, డీఈఓ

యూరియా సరఫరాలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్: రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని జిల్లా రైతుబంధు సమితి మాజీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. గురువారం నల్లగొండలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుస్తు ప్రణాళికను రూపొందించని కారణంగా ఎరువుల కోసం రైతులు పరుగులు పెడుతున్నారన్నారు. ప్రైవేట్ దుకాణాల్లో వ్యవసాయాధికారుల సమక్షంలో యూరియా విక్రయించాలన్నారు. పంటలకు నష్టం జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. సమావేశంలో జిట్ట లింగయ్యయాదవ్, చల్ల ఆంజనేయులు యాదవ్ పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



పెద్దవూర : నవోదయ విద్యాలయంలో పాఠం చెబుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దవూర : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితేనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం ఆమె పెద్దవూర మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల గురుకులాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఇంగ్లిష్ బాషపై పట్టు సాధించాలని సూచించారు.మినీ గురుకులానికి అప్రోచ్ రోడ్డు కావాలని కలెక్టర్‌ను సిబ్బంది కోరగా వెంటనే మంజూరు చేశారు. విద్యార్థుల ఆట వస్తువులకు నిధులు మంజూరు చేశారు. అంతకుముందు ఎంపీడీఓ కార్యాలయంలో పీఎం ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఆ తరువాత చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠం చెప్పారు. ఆమె వెంట గృహనిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దార్ శాంతిలాల్, ఎంపీడీఓ ఉమాదేవి, ఎంఈఓ రాము తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓ నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపండి

తిరుమలగిరి(సాగర్) : ఎంపీడీఓ కార్యాలయ నూతన భవనానికి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం ఆమె తిరుమలగిరి సాగర్ మండల కేంద్రంలో శిథిలావస్థలో ఉన్న ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం ఎంపీడీఓ కార్యాలయం పాత పీఏసీఎస్‌సీ భవనంలో అరకొర గదులలో కొనసాగుతుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె స్పందించి పైవిధంగా మాట్లాడారు. ఆమె వెంట గృహనిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, తహసీల్దార్ అనిల్, ఇన్‌చార్జి ఎంపీడీఓ భిక్షం రాజు ఉన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

- నిడమనూరులో జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై రాస్తారోకో
- ప్రాథమిక సహకార సంఘాల్లోనే విక్రయించాలని డిమాండ్



నిడమనూరు : జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

నిడమనూరు : నిడమనూరు రైతు ప్రాథమిక సహకార సంఘానికి వారం రోజులుగా యూరియా రాకపోవడంతో గురువారం రైతులు ఆగ్రహించారు. ఉదయం 6 గంటలకే సంఘం కార్యాలయం వద్దకు అక్కడి చేరుకున్న రైతులు వెంటనే యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ నిడమనూరుక బస్టాండ్ వద్ద జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై రెండు గంటలకుపైగా రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ నిడమనూరు సహకార సంఘానికి ఈ వారంలో యూరియా రాలేదన్నారు. వారం క్రితం పలు ఎరువుల దుకాణాలకు దాదాపు 140 మెట్రిక్ టన్నుల వరకు యూరియా రావడంతో వారు కొందరు రైతులకే ప్రభుత్వ ధరకు అమ్మి మిగతాది అధిక ధరలకు విక్రయించుకున్నారని ఆరోపించారు. నిడమనూరు, వెనిగండ్ల సహకార ఎరువుల విక్రయకేంద్రంలో కొందరు ఉద్యోగులు కూడా అక్రమాలకు పాల్పడి యూరియాను పక్కదారి పట్టిస్తున్నారని వాపోయారు. సహకార సంఘాల ద్వారానే యూరియాను విక్రయించి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. అయితే నిడమనూరు ఎస్ఐ శిక్షణకు వెళ్లడంతో, హాలియా ఎస్ఐ సాయిప్రశాంత్ రైతుల వద్దకు వచ్చి వారికి నచ్చచెప్పి ధర్నాను విరమింపజేశారు.

నిడమనూరు ఏఓ సస్పెన్షన్

యూరియా పంపిణీలో జరిగిన అవకతవకలు, రైతుల రాస్తారోకోపై స్పందించని నిడమనూరు ఏఓ మునికృష్ణయ్యను కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు హాలియా ఏడీ సరిత గురువారం తెలిపారు. నిడమనూరులో గురువారం ఉదయం జడ్చర్ల-కోదాడ రహదారిపై రైతులు ధర్నా చేశారు. ధర్నాపై వ్యవసాయాధికారి సకాలంలో స్పందించలేదని జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు స్థానిక పోలీసులు వివరించారు. దీంతో ఎస్పీ వెంటనే ధర్నా వివరాలను కలెక్టర్‌కు వివరించడంతో సస్పెండ్ చేసినట్లు తెలిసింది. బుధవారం సాయంత్రం నిడమనూరు మండలం నారమ్మగూడెం, ముకుందా పురం, నిడమనూరు, బొక్కమంతలపహా డ్‌లోని ఎరువుల దుకాణాలకు వచ్చి యూరియా పక్కదారి పట్టిందనే ఆరోపణలున్నాయి. ఈ విషయాన్నే రైతులు ప్రస్తావించారు. అయితే సస్పెండైన ఏఓ మునికృష్ణయ్య హాలియా, తిరుమలగిరి సాగర్ మండలాలకు ఇన్‌చార్జి ఏఓగా వ్యవహరిస్తున్నారు.



దామరచర్ల మండల కేంద్రంలో రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

దామరచర్లలో ఆందోళన

మిర్యాలగూడ: యూరియా సకాలంలో అందించాలనే డిమాండ్‌తో గురువారం దామరచర్ల మండల కేంద్రంలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ తెల్లవారుజామున 3గంటల నుంచే యూరియా కోసం పడిగాపులు కాస్తున్నా పట్టించునే నాథుడే లేడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటిల్లిపాది వచ్చి క్యూలైన్‌లో నిల్చోవాల్సిన యూరియా దొరకడం లేదన్నారు. వరినాట్లు పెట్టి నెలరోజులైనా మొదటి విడత యూరియా చల్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇదే పరిస్థితి మరో 15రోజులు కొనసాగితే వరిపంట ఎదుగుదల ఆగి దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రైతులకు యూరియా అందించాలని కోరారు. ఈ విషయం తెలుసుకున్న మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్ అక్కడికి వచ్చి ప్రతి రైతుకు రెండు బస్తాలకు టోకెన్లు ఇప్పించి రైతుల రాస్తారోకోను విరమింపజేశారు.

క్లుప్తంగా

ఆటోను ఢీకొట్టిన బొలేరో.. నలుగురికి గాయాలు

నాగార్జునసాగర్: ఆటోను బొలేరో వాహనం ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం సాగర్ డ్యాం దిగువన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాగర్ డ్యాం దిగువన హిల్‌కాలనీ నుంచి పైలాన్ కాలనీకి వెళ్తున్న ఆటోను వెనుక నుంచి బొలేరో వాహనం ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న బాలునాయక్, మల్లేశ్వరి, ఆటో డ్రైవర్ రవినాయక్‌తో పాటు విఘ్నేష్ అనే బాలుడికి దెబ్బలు తగిలాయి. సాగర్ ఎస్‌ఐ ముత్తయ్య ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వారిని నల్లగొండకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తండ్రి, కుమార్తెకు..

ఆత్మకూరు(ఎం): రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమార్తెకు గాయాలయ్యాయి. ఈ ఘటన ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన పారుపల్లి సోమయ్య, అతడి కుమార్తె రాణి బైక్‌పై గురువారం సాయంత్రం మోత్కూరుకు వెళ్తున్నారు. అదే సమయంలో పోసానికుంట నుంచి సామ రవీందర్‌రెడ్డి కారులో ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న పారుపల్లి సోమయ్య, అతడి కుమార్తె రాణి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ హనుమంతు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

సూర్యాపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌పహాడ్ మండలం పొట్లపహాడ్ గ్రామానికి చెందిన ఇరుగు రవీందర్(59) బుధవారం తన బైక్‌పై సూర్యాపేట నుంచి పెన్‌పహాడ్ వైపు వెళ్తుండగా.. సూర్యాపేట పట్టణంలోని శాంతినగర్ సమీపంలో ముందుగా వెళ్తున్న ఆటో డ్రైవర్ ఒక్కసారిగా ఆపడంతో వెనుక నుంచి బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రవీందర్ తలకు బలమైన గాయమైంది. అతడిని సూర్యాపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వెంకటయ్య తెలిపారు.

వాగులో కొట్టుకుపోయిన యువకుడు


దండు నరేష్

బీబీనగర్: బీబీనగర్ మండలం గూడూరు పరిధిలో గురువారం చిన్నేటి వాగు దాటుతూ యువకుడు కొట్టుకుపోయాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా నాచారం ప్రాంతానికి చెందిన దండు నరేష్ గురువారం గూడూరు టోల్‌ప్లాజా సమీపంలో బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్ వద్ద చిన్నేటి వాగును చూసి.. బ్రిడ్జిపై నుంచి అవతలి వైపు దాటేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో నీటి తాకిడికి అదుపుతప్పి వాగులో కొట్టుకుపోయాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఆర్డీఓ కృష్ణారెడ్డి, తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి గాలింపు చర్యలు ముమ్మరంగా చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

- ఈ నెల 20 నుంచి అక్టోబర్ 2 వరకు నడపనున్న ఆర్టీసీ
- ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల నుంచి 705 బస్సులు



మిర్యాలగూడ టౌన్: తెలంగాణలో ముఖ్యమైన పండుగల్లో దసరా ఒకటి. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన ప్రజలు దసరా పండుగకు సొంతూళ్లకు వస్తూ ఉంటారు. దీంతో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు ఈ నెల 20వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడిపించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆర్టీసీ ఇటీవల వివిధ పండుగల సమయంలో ప్రత్యేక బస్సులు నడిపి కొంతవరకు ఆదాయం సమకూర్చుకున్నప్పటికీ.. దసరా పండుగ ద్వారా మరింత ఆదాయం సమకూర్చుకోవాలనే లక్ష్యంతో ఉంది. ఉమ్మడి జిల్లాలోని నార్కట్‌పల్లి, యాదగిరిగుట్ట, దేవరకొండ, నల్లగొండ, మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట డిపోల నుంచి దసరా పండుగ సందర్భంగా తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను అధికారులు నడిపించనున్నారు. నల్లగొండ రీజియన్ పరిధిలోని ఏడు డిపోల నుంచి ఈ నెల 20న 50 బస్సులు, 21న 50, 22న 55, 23న 50, 24న 50, 25న 50, 26న 60, 27న 65, 28న 65, 29న 70, 30న 65, అక్టోబర్ 1న 65, 2వ తేదీన 10 బస్సుల చొప్పున నడిపించనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. అదేవిధంగా హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్, సాగర్ రింగ్ రోడ్డు, ఉప్పల్ క్రాస్ రోడ్డు, ఎల్బీ నగర్ తదితర ప్రాంతాల్లో ఆయా డిపోలకు చెందిన ఆర్టీసీ అధికారులు అందుబాటులో ఉండనున్నట్లు పేర్కొన్నారు.

డిపోల వారీగా నడపనున్న ప్రత్యేక బస్సుల సంఖ్య

డిపో	బస్సులు
దేవరకొండ	131
కోదాడ	94
మిర్యాలగూడ	115
నల్లగొండ	89
నార్కట్‌పల్లి	36
సూర్యాపేట	144
యాదగిరిగుట్ట	96

రద్దీని బట్టి మరిన్ని బస్సులు నడుపుతాం



దసరా పండుగకు ప్రస్తుతం కేటాయించిన బస్సులతో పాటు ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్ని బస్సులు నడుపుతాం. నల్లగొండ రీజియన్ పరిధిలోని ఏడు డిపోల పరిధిలో నుంచి మొత్తం 705 ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నాం. ప్రయాణికులకు ఏఏ డిపో బస్సులు ఏఏ రూట్లలో వెళ్తున్నాయో తెలిపేందుకు ఏడు డిపోలకు చెందిన సిబ్బందిని హైదరాబాద్‌లో ఏర్పాటు చేశాం. – కొణతం జానిరెడ్డి, ఆర్టీసీ ఆర్‌ఎం, నల్లగొండ

సాగర్ డ్యాంపై 'స్వచ్ఛతా హీ సేవ'


సాగర్ ఆనకట్టపై చీపుర్లతో ఊడుస్తున్న కేఆర్‌ఎంబీ చైర్మన్ బీపీ పాండే, ఇంజనీర్లు

- పాల్గొన్న కేఆర్‌ఎంబీ చైర్మన్ బీ.పీ. పాండే

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టుపై స్వచ్ఛతా హీ సేవ క్యాంపెయిన్‌ను కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్‌ఎంబీ) చైర్మన్ బీ.పీ. పాండే ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ప్రధాన ఆనకట్టతో పాటు డ్యాం పరిసరాల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ సిబ్బందితో కలిసి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం పైలాన్ పిల్లర్ పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి వనరులను కాపాడుకోవాలని, ప్లాస్టిక్ బాటిళ్లు కవర్లు సాగర్ జలాల్లో వేయొద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్లు, అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా బుద్ధవనాన్ని కూడా ఆయ సందర్శించారు. శుక్రవారం ఉదయం కేఆర్‌ఎంబీ చైర్మన్ బీ.పీ. పాండే నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి బయల్దేరి పులిచింతల ప్రాజెక్టుకు సందర్శించనున్నారు.

తప్పిపోయిన ఇద్దరు చిన్నారులు

- సురక్షితంగా తల్లిదండ్రులకు వద్దకు చేర్చిన పోలీసులు


చోక్లాతండాలో తల్లిదండ్రులకు చిన్నారులను అప్పగిస్తున్న పోలీసులు

యాదగిరిగుట్ట: తుర్కపల్లి మండలం చోక్లా తండాలో గురువారం ఇద్దరు చిన్నారులు తప్పిపోయారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు గంటల వ్యవధిలోనే చిన్నారులను గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, చిన్నారుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రహీమొద్దిన్, మెహరున్నీసా దంపతులు, వారి కుమారుడు అబ్దుల్ రెహమాన్(మూడున్నర సంవత్సరాలు), బిహార్‌కు చెందిన పప్పు సహానీ, కాంతిదేవి దంపతులు, వారి కుమార్తె ప్రీతికుమారి(3) బతుకుదెరువు నిమిత్తం తుర్కపల్లి మండలం చోక్లా తండాకు వలస వచ్చి ఉంటున్నారు. చిన్నారులు అబ్దుల్ రెహమాన్, ప్రీతికుమారి గురువారం ఉదయం 7గంటల సమయంలో ఇంటి వద్ద ఆడుకుంటూ కనిపించకుండా పోయారు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు గ్రామంలో ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తుర్కపల్లి ఎస్‌ఐ తక్యుద్దీన్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి చోక్లా తండాకు చేరుకొని చిన్నారుల ఫొటోలను సేకరించారు. యాదగిరిగుట్ట ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు, రూరల్ సీఐ శంకర్‌గౌడ్‌కు విషయాన్ని తెలిపి గాలింపు చర్యలు చేపట్టారు. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో తుర్కపల్లి మండలం రుస్తాపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో పోలీసులు గాలిస్తుండగా.. ఇద్దరు చిన్నారులు కనిపించారు. ఎస్‌ఐ తక్యుద్దీన్, సిబ్బంది చిన్నారులను చోక్లా తండాలో తల్లిదండ్రుల వద్దకు తీసుకెళ్లి ఏసీపీ శ్రీనివాస్‌నాయుడు, సీఐ శంకర్‌గౌడ్ ఆధ్వర్యంలో అప్పగించారు. గుర్తుతెలియని వ్యక్తులు చిన్నారులను ఎత్తుకెళ్లి రుస్తాపురం అటవీ ప్రాంతంలో వదిలి వెళ్లి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులకు చిన్నారుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కూరెళ్ల సాహిత్యం, సమాలోచనంపై సదస్సు

రామన్నపేట: రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య సాహిత్యం–సమాలోచనం అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాహత్‌ఖానం, తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కూనూరు లక్ష్మణ్, మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు పిల్లలమర్రి రాములు, ముగింపు సమావేశానికి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి వెల్దండ నిత్యానందరావు, అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి హాజరవుతారని తెలిపారు. వివిధ విద్యాసంస్థలకు చెందిన 36మంది అధ్యాపకులు కూరెళ్ల రచనలపై పత్ర సమర్పణ చేస్తారని పేర్కొన్నారు.

సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి


ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జూలకంటి రంగారెడ్డి తదితరులు

రామన్నపేట : భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులు మాత్రమే నిజమైన వారసులని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. రామన్నపేట మండలం మునిపంపుల గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించడానికి బీజేపీ చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పకొట్టాలని పిలుపునిచ్చారు. సాయుధ పోరాటంతో సంబంధం లేని బీజేపీ విమోచనం పేరుతో హిందూ, ముస్లింల మధ్య వైషమ్యాలను సృష్టించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. 4వేల మంది ప్రాణాలు అర్పించి వేలాది గ్రామాలను విముక్తులను చేసి, లక్షల ఎకరాల భూములను పంచిన కమ్యూనిస్టుల పోరాట చరిత్రను ఎవరూ చెరపలేరని అన్నారు. ఈ సందర్భంగా సాయుధ పోరాట వీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, జెల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, గడ్డం వెంకటేశం, కల్లూరి నాగేష్, జంపాల అండాలు, కందుల హన్మంత్, తొల్పునూరి శ్రీనివాస్, మేకల కృష్ణయ్య, గంటిపాక శివ, ఈర్లపల్లి ముత్యాలు, జోగుల శ్రీనివాస్, తొల్పునూరి చంద్రశేఖర్, నోముల రమేష్, బూడిద భిక్షం ఉమాపతి, భాషయ్య, ధనలక్ష్మీ, నాగార్జున, నర్సింహ పాల్గొన్నారు.

టీపీడీఎంఏ అధ్యక్షుడిగా తీకుళ్ల శ్రీనివాస్‌రెడ్డి



సూర్యాపేటటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల యాజమాన్య సంఘం నూతన అధ్యక్షుడిగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్పందన డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ తీకుళ్ల శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. చౌటుప్పల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు చెప్పారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా సీహెచ్. సత్యంగౌడ్, కోశాధికారిగా సుదినమోని హనుమంతుయాదవ్, ఉపాధ్యక్షుడిగా మెండు వెంకట్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా ఆంజనేయులు, ప్రవీణ్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి. శంకర్, కమిటీ సభ్యులుగా నాగేందర్‌రెడ్డి, సైదారావు, భాస్కరరావు, సుభాష్‌రెడ్డిని ఎన్నుకున్నట్లు తెలిపారు. ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

రైతులు నాణ్యమైన విత్తనాలు వాడాలి

- ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త రామకృష్ణ


మునగాలలో వరి పంటను పరిశీలిస్తున్న రామకృష్ణ, వ్యవసాయ శాఖ సిబ్బంది

మునగాల: రైతులు నాణ్యమైన విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త ఏ. రామకృష్ణ సూచించారు. జూలైలో మునగాల మండలంలోని పలు గ్రామాలకు చెందిన 33మంది రైతులకు వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఉచితంగా కేఎన్‌ఎం 1638 వరి రకం, డబ్ల్యు జిజి 385 పెసర రకం విత్తనాలను అందజేశారు. ఈ క్రమంలో మునగాల మండలంలోని తాడువాయి, మునగాల, గణపవరం, బరాఖత్‌గూడెం గ్రామాల్లో రైతులు సాగుచేసిన నూతన వరి వంగడాలను వ్యవసాయ శాస్త్రవేత్త రామకృష్ణ పరిశీలించారు. అనంతరం రైతులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మునగాల మండల వ్యవసాయాధికారి బుంగా రాజుతో పాటు వ్యవసాయ విస్తరణాధికారులు రమ్యతేజ, నాగు, భవాని, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

మూసీ నదిలో వ్యక్తి మృతదేహం లభ్యం

- మృతుడు హైదరాబాద్‌లో గల్లంతైనట్లు గుర్తించిన పోలీసులు

వలిగొండ: వలిగొండ మండల పరిధిలోని సంగెం గ్రామ సమీపంలోని భీమలింగం కత్వ వద్ద లోలెవల్ వంతెనపై గురువారం ఓ వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అప్రమత్తమై మూసీ పరీవాహక ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల కురిసిన వర్షాలకు వరదలో గల్లంతైన వ్యక్తి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు మృతదేహం వద్దకు చేరుకుని మృతుడు కంబేల అర్జున్(28)గా గుర్తించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగంధర్ తెలిపారు.

అత్యవసర సేవలు.. టోల్ ఫ్రీ నంబర్లు

తిరుమలగిరి(తుంగతుర్తి): ఆపదలో ఉన్నా, ఏదైనా ప్రమాదం జరిగినా, సహాయం కావాలన్నా, సైబర్ మోసానికి గురైనా ప్రభుత్వం కేటాయించిన టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేస్తే తక్షణ సహాయం పొందవచ్చు. ఏఏ సేవలకు ఎటువంటి టోల్ ఫ్రీ నంబర్లు అందుబాటులో ఉన్నాయో అవగాహన పెంచుకుందాం.

- **100** - ఇంట్లో చోరీ జరిగినా, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి ఆపద ఉన్నా, కళ్ల ముందే నేరాలు, హింసాత్మక ఘటనలు చోటు చేసుకున్నా వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వొచ్చు. సమాచారం అందుకున్న పది నిమిషాల్లోనే పోలీసులు మీ ముందుంటారు.
- **102** - బాలింతలు, పిల్లలు ఆస్పత్రులకు వెళ్లేందుకు అంబులెన్స్ సహాయం లభిస్తుంది. నిరంతరం అందుబాటులో వైద్య సహాయం కోసం ఈ నంబర్‌ను సంప్రదించవచ్చు.
- **1100** - మీ సేవా కేంద్రాల్లో అందిస్తున్న సేవల్లో లోపాలపై ఫిర్యాదు చేయవచ్చు. దీని ద్వారా పరిష్కారం కూడా లభిస్తుంది. సేవలకు సంబంధించిన ఛార్జీలు, వసూళ్ల సమాచారాన్ని తెలుసుకోవచ్చు.
- **1916** - మిషన్ భగీరథ నీటి సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ఈ నంబరును వినియోగించుకోవచ్చు. గ్రామాల్లో తాగునీటికి సంబంధించిన సమస్యలపై ఫిర్యాదు చేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.
- **14567** - వృద్ధుల సంక్షేమం కోసం పింఛన్లు, ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఈ టోల్ ఫ్రీ నంబర్ ఉపయోగపడుతుంది. ఈ సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయి.
- **108** - ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించాలంటే ఈ నంబరుకు కాల్ చేయాలి. రహదారి ప్రమాదాలు, గాయాల పాలైన వారికి అత్యవసర వైద్య సేవల కోసం సమాచారం ఇవ్వొచ్చు
- **112** - వైద్యం, పోలీసు సాయం కోసం ఈ నంబర్ ఉపయోగపడుతుంది. అత్యవసర సేవలు, అగ్నిప్రమాద సమయాల్లో ఈ నంబరుకు కాల్ చేస్తే నిమిషాల్లో సేవలందుతాయి.
- **1912** - విద్యుత్తు సమస్యలపై దీన్ని వినియోగించుకోవచ్చు. ఈ నంబర్‌ను సంప్రదిస్తే సమస్య పరిష్కారానికి అవకాశం ఉంటుంది. సిబ్బంది చేతివాటంతో పాటు సమస్య ఉంటే ఇందులో ఫిర్యాదు చేయవచ్చు.
- **1098** - బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు దీనిని వినియోగించాలి. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేసి బాలలకు విముక్తి కల్పిస్తారు.
- **1064** - ప్రభుత్వ కార్యాలయాల్లో ఏదైనా పనికి లంచం అడిగినా, అవినీతి అధికారులను పట్టించేందుకు ఈ నంబరుకు ఫిర్యాదు చేయవచ్చు.
- **1930/155520** - సైబర్ మోసాలపై ఈ నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వొచ్చు. మోసానికి గురైన వెంటనే సమాచారం ఇవ్వడం ద్వారా డబ్బు సైబర్ నేరగాళ్లకు వెళ్లకుండా సంబంధిత బ్యాంకు ఖాతాను స్తంభింపజేస్తారు.

మదర్ డెయిరీ నామినేషన్లకు నేడే ఆఖరు

- రేపు పరిశీలన.. 27న పోలింగ్

హయత్‌నగర్: నల్లగొండ– రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ లిమిటెడ్(నార్ముల్ మదర్ డెయిరీ) పాలక మండలి డైరెక్టర్ల ఎన్నికల ప్రక్రియ కొనసాగుతోందని ఎన్నికల అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ నెలలో ముగ్గురి పదవీకాలం ముగియనుందని, ఈ స్థానాల కోసం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు నామినేషన్ల పరిశీలన, అనంతరం పోటీలో ఉన్న వారి పేర్లను ప్రకటిస్తామని తెలిపారు. సోమవారం సాయంత్రం 5గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ, పోటీలో ఉన్నవారి తుది జాబితాను విడుదల చేస్తామని, పోటీ లేకపోతే వెంటనే ఏకగ్రీవమైన వారి వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. పోటీ ఉంటే ఈ నెల 27న హయత్‌నగర్‌లోని ఎస్వీ గార్డెన్స్‌లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తామని, ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

ఇప్పటికే పది నామినేషన్లు

మదర్ డెయిరీ ఎన్నికల్లో మూడు స్థానాల్లో పోటీ చేసేందుకు గురువారం వరకు పది నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. జనరల్ మహిళ స్థానానికి రెండు, రెండు జనరల్ స్థానాలకు ఎనిమిది నామినేషన్లు వచ్చాయన్నారు.

డైరెక్టర్ పదవికి నామినేషన్ దాఖలు


మదర్ డెయిరీ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు అందజేస్తున్న గంట్ల రాధిక

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం ఎన్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన గంట్ల రాధిక మదర్ డెయిరీ డైరెక్టర్ పదవి కోసం హైదరాబాద్‌లోని మదర్ డెయిరీ ప్రధాన కార్యాలయంలో గురువారం నామినేషన్ దాఖలు చేశారు. తన నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారి ఏ. వెంకట్‌రెడ్డికి ఆమె అందజేశారు. రొటేషన్ పద్ధతిలో ఖాళీ అయిన మూడు డైరెక్టర్ స్థానాల్లో ఒకటి జనరల్(మహిళ)కు రిజర్వ్ కావడంతో నామినేషన్ దాఖలు చేసినట్లు రాధిక తెలిపారు. ఆమె వెంట ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు గంట్ల వేణుగోపాల్‌రెడ్డి, భైరవునిబండ, పెర్కకొండారం, ఇటుకులపహాడ్, శాపల్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల చైర్మన్లు అప్పారెడ్డి, యాదవరెడ్డి, సురేశ్, పాపయ్య తదితరులు ఉన్నారు.

గ్లోబల్ అయ్యప్ప కాంక్లేవ్‌కు ఆహ్వానం


జగదీష్

హుజూర్ నగర్: కేరళలోని దేవాలయాలను నిర్వహించే ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు 75వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 20న శబరిమలలోని పంపా నది ఒడ్డున నిర్వహించనున్న గ్లోబల్ అయ్యప్ప కాంక్లేవ్‌కు హుజూర్‌నగర్‌కు చెందిన దొడ్డారపు జగదీష్‌కు ఆహ్వానం లభించింది. గత 29 ఏళ్లగా అయ్యప్ప మాల ధరిస్తూ శబరిమలకు వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకుంటున్నానని, తనకు ఆహ్వానం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు గురువారం జగదీష్ విలేకరులకు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకుని ఆత్మహత్య

- మృతుడి స్వస్థలం ఏపీలోని శృంగవరపుకోట

చౌటుప్పల్ రూరల్: ఆర్థిక ఇబ్బందులతో మానసిక వేదనకు గురైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలో గురువారం సాయంత్రం జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని విజయనగరం జిల్లా శృంగవరపుకోటకు చెందిన ఎరువాక పైడినాయుడు(45) గత 16 ఏళ్లగా చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామ పరిధిలోని దివిస్ ఫార్మా కంపెనీలో హెల్పర్‌గా పనిచేస్తూ అంకిరెడ్డిగూడెంలోనే భార్య రామలక్ష్మి ఇద్దరు కుమార్తెలతో కలిసి నివసిస్తున్నాడు. అతడి పెద్ద కుమార్తెకు బ్రెయిన్ ట్యూమర్ ఉందని వైద్యులు చెప్పడంతో కొంతకాలంగా మానసిక వేదనకు గురవుతున్నాడు. వైద్య ఖర్చులకు డబ్బులు లేక ఆర్థికంగా కూడా ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి భార్య ఇంటికి వచ్చి చూడగా తలుపు లాక్ చేసి ఉండడంతో చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చింది. వారు వచ్చి తలుపు పగులగొట్టి చూడగా పైడినాయుడు ఉరికి వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు.

పత్తిలో తలమాడు తెగులు– నివారణ చర్యలు


పత్తిలో తలమాడు తెగులు గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పాడిపంట

గరిడేపల్లి: ప్రస్తుతం పత్తి పంట 85 నుంచి 90రోజుల దశలో ఉంది. చాలా వరకు పూత దశలో, కాత దశలో మరియు కాయ తయారయ్యే దశలో ఉండటం గమనించవచ్చు. ప్రస్తుతం పత్తిలో చాలా చోట్ల తలమాడు తెగులు ఆశిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. తలమాడు తెలుగు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డి. ఆదర్శ్ వివరించారు. పత్తి పంటలో కలుపు మొక్కలైన వయ్యారిభామ, ఉత్తరేణి, తుత్తురు బెండతో పాటు తామర పురుగులు ఎక్కువగా ఉండటం వలన తలమాడు తెగులు ఆశిస్తుంది. ఈ తెగులు సోకితే మొక్క కొమ్మల చివరి భాగంలో ఉండే లేత ఆకులు పసుపు రంగులోకి మారడంతో పాటు ఆకులు మాడిపోయినట్లు, వంకర్లు తిరిగినట్లు కనిపిస్తాయి. ఈ తెగులు తీవ్రమైనప్పుడు కొమ్మల పెరుగుదల ఆగిపోయి పూర్తిగా గిడసబారిపోతాయి. పూత దశలో ఉండే మొక్కలు కూడా ఎండిపోయి రాలిపోతాయి. తామర పురుగులు వయ్యారిభామను ఆశించి రసం పీల్చే సమయంలో వాటిపై పడిన పుప్పొడి రేణువులు ఆరోగ్యంగా ఉన్న పత్తి పంటపై పడి పంట కణజాల్లోకి ప్రవేశించి వైరస్‌ను వ్యాప్తి చేస్తుంది. ఈ పురుగులు ఒక మొక్క నుంచి ఇంకొక మొక్కకి వెళ్లినప్పుడు వైరస్ వ్యాప్తి జరుగుతుంది. దీని నివారణకై పత్తి పంటలో కలుపు మొక్కలను వెంట వెంటనే తీసివేయాలి. తామర పురుగుల నివారణకు ఎకరానికి 15 నుంచి 20 నీలిరంగు జిగురు అట్టలను పెట్టుకోవాలి. అలాగే వేపనూనె, 1500పీపీఎం 5మి.లీ., మోనోక్రోటోఫాస్ 1.6మి.లీ లేదా ఫిప్రోనిల్ 2మి.లీ లేదా అసిటామిప్రిడ్ 0.2గ్రా. లేదా ఫ్లోనికామిడ్ 0.3గ్రా. లీటరు నీటికి కలిపి మార్చి మార్చి 15రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి.